26న నరసాపురం న్యాయవాదుల సంఘం ఎన్నికలు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నరసాపురం న్యాయవాదుల సంఘం నూతన కమిటీ ఎన్నికకు ఈ నెల 26న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి, న్యాయవాది పూరిళ్ల శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఎన్నికల షెడ్యూలు ప్రకటించారు. న్యాయవాదుల సంఘం ఎన్నికల కోసం ఈ నెల 15, 16 తేదీల్లో నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. 17న నామినేషన్ల పరిశీలన ఉంటుందని, నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 20వ తేదీ వరకూ గడువు ఉంటుందని తెలిపారు. పోలింగ్ ప్రక్రియ ఈ నెల 26వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రారంభమై సాయంత్రం 4.30 గంటల వరకూ కొనసాగుతుందని, అదేరోజు ఓట్లను లెక్కించి ఫలితాలు కూడా వెల్లడిస్తామని శ్రీనివాస్ తెలిపారు.

మూగ రోదన..!

- అకాల వర్షాలతో తడిసి ముద్దయిన గడ్డి
- జాగ్రత్త చేసుకునే అవకాశం దక్కని రైతులు
- రెండు జిల్లాల్లో తొమ్మిది లక్షలకుపైగా గేదెలు, ఆవులు
- ప్రతిరోజూ లక్షా 50 వేల లీటర్లకుపైగా పాల ఉత్పత్తి
- ఎండుగడ్డి కొరతతో పశుపోషణపై రైతులకు అగమ్యగోచరం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అకాల వర్షాలు అన్నదాతను అన్నిరకాలుగానూ ఇబ్బందులకు గురిచేశాయి. ఇప్పటికే ఆరుగాలం కష్టపడి పండించిన రబీ పంట తడిచి ముద్దవ్వడంతో అన్నదాత కష్టాలు వర్ణనాతీతం. వర్షాలకు యంత్రాలతో కోత అనంతరం పొలాల్లో ఉన్న ఎండుగడ్డి మొత్తం తడిసి ముద్దవ్వడంతో రైతులకు ఏంచేయాలో పాలుపోని పరిస్థితి నెలకొంది. రెండు జిల్లాల్లో తొమ్మిది లక్షలకుపైగా పశువులు ఉన్నాయి. వీటిలో ఏలూరు జిల్లాలో గేదెలు నాలుగు లక్షలు, ఆవులు రెండు లక్షల వరకూ ఉండగా, పశ్చిమలో మూడు లక్షల వరకూ గేదెలు, ఆవులు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రతిరోజూ ఏలూరు జిల్లాలో లక్షా 15 వేల లీటర్ల వరకూ పాల ఉత్పత్తి జరుగుతుండగా, పశ్చిమలో 50 వేల లీటర్లకుపైగా పాల ఉత్పత్తి జరుగుతున్న పరిస్థితి ఉంది. వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోవడంతో పాల ఉత్పత్తితోనే రైతుల జీవనం ముందుకు సాగుతోంది. తవుడు, చిట్టు వంటి దాణా ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. ఆక్వా చెరువులు పెరిగిపోవడంతో పచ్చిగడ్డి సైతం తీవ్ర ఇబ్బందిగా మారింది. రైతులు అత్యధికంగా ఎండుగడ్డిని పశువులకు ఉపయోగిస్తారు. గతంలో కూలీలతో కోతలు, నూర్పిళ్లు చేసినప్పుడు జిల్లాలో ఎండుగడ్డికి కొరత ఉండేది కాదు. జిల్లాలో ఖరీఫ్, రబీల్లో దాదాపు పది లక్షల ఎకరాల్లో వరిసాగు సాగుతోంది. దీంతో ఎండుగడ్డికి రైతులకు ఇబ్బంది అనేది పెద్దగా లేకుండా లేని పరిస్థితి ఉండేది. మిషన్ కోతలు వచ్చిన తర్వాత ఎండుగడ్డి కొరత వేధిస్తున్న పరిస్థితి సాగుతోంది. దీంతో యంత్రాలతో కోత కోసిన తర్వాత పొలంలో పడి ఉన్న గడ్డిని జాగ్రత్త చేసి రైతులు పశువులకు వినియోగిస్తున్నారు. ఖరీఫ్‌లోనూ వర్షాలతో ఎండుగడ్డి రైతులు పెద్దగా జాగ్రత్త చేసుకోలేని పరిస్థితి ఉంది. ప్రస్తుత రబీలో అకాల వర్షాలు విరుచుకుపడటంతో మిషన్ కోత కోసిన తర్వాత పొలాల్లో ఉన్న గడ్డి తడిసిముద్దయిపోయింది. వర్షాలకు నేలకొరిగిన పొలాల్లో గడ్డి పని చేయని దుస్థితి నెలకొంది. ప్రతియేటా రెండు, మూడు పశువులు ఉన్న రైతులు రెండు ట్రాక్టర్ ట్రక్కుల గడ్డిని నిల్వ చేసుకునేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండాపోయింది.

పశుపోషణ సాగేదెలా..

ఎండుగడ్డి సమస్య ఏర్పడటంతో రైతులకు ఏం చేయాలో అర్థంకాని పరిస్థితి ఏర్పడింది. ఏడాది పొడవునా పశుపోషణ ఎలాగనే ఆందోళన వారిని వెంటాడుతోంది. దాణా, పచ్చిగడ్డి కొనుగోలు చేసి పశు పోషణ అంటే పెద్దఎత్తున ఖర్చుతో కూడుకున్న పని. ఎండుగడ్డి ఉంటే కొంత ఖర్చు తగ్గుతోంది. ప్రస్తుతం కొన్నిచోట్ల ఎండుగడ్డి విక్రయాలు సాగుతున్నాయి. అయితే చిన్న మోపు రూ.వందకు విక్రయిస్తున్నారు. ట్రాక్టర్ ట్రక్కు గడ్డి కొనుగోలు చేయాలంటే రూ.25 వేలు వరకూ ఖర్చయ్యే పరిస్థితి నెలకొంది. ఇంత పెద్దమొత్తంలో వెచ్చించి ఎండుగడ్డి కొనుగోలు చేసే పరిస్థితిలో రైతులు లేరు. దీంతో రెండు పశువులు ఉంటే ఒక పశువును విక్రయించే ఆలోచనలో రైతులు ఉన్నట్లు చెబుతున్నారు. అదే జరిగితే రైతుల జీవనంపై తీవ్ర ప్రభావం పడుతుంది. పాలతో వచ్చే ఆదాయం తగ్గిపోవడంతో చాలా కుటుంబాలను ఆర్థిక కష్టాలు వెంటాడనున్నాయి. ప్రభుత్వం టిఎంఆర్ (టోటల్ మిక్స్‌డ్ దాణా) పేరుతో సబ్సిడీ ధరలకు రైతులకు అందిస్తోంది. ప్రస్తుతం 30 టన్నుల వరకూ ఇస్తున్నట్లు సమాచారం. దీన్ని మరింత ఎక్కువగా రైతులకు సరఫరా చేస్తే మేలు జరుగుతోంది. లేకపోతే పశువులు ఉన్న రైతులు అయినకాడికి అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడనుంది. అదే సమయంలో పాలకొరత పెరిగి ప్రజలు ఇబ్బంది పడే పరిస్థితి రానుంది. ప్రభుత్వం ముందుగానే దీనిపై ఆలోచించి ప్రత్యామ్నాయాలను ఆలోచించి రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంది.

కలెక్టర్‌చే జెవికె కిట్ల తనిఖీ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

యూనిఫారం పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

తాడేపల్లిగూడెం మండలం పడాల పాఠశాల, పెంటపాడు మండలం పోస్ట్‌బేసిక్ స్కూల్‌లో ఉన్న జగనన్న విద్యాకానుక కిట్లను జిల్లా కలెక్టర్ ప్రశాంతి శనివారం పరిశీలించారు. స్కూల్ బ్యాగ్‌లు, యూనిఫారం, బూట్లు, ఇతర వస్తువులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1413 పాఠశాలల్లోని విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందజేస్తున్నామన్నారు. జిల్లాలో జగనన్న విద్యా కానుక కింద 2023-24 విద్యా సంవత్సరంలో ఒకటి నుంచి పదో తరగతి వరకూ విద్యార్థులకు ఒకొక్కరికీ సుమారు రూ.2 వేలు విలువైన విద్యాకానుక కిట్‌ను అందజేయనున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థికీ పాఠశాల ప్రారంభించిన తొలి రోజే మూడు జతల యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్ట్‌లు, స్కూల్ బ్యాగ్, డిక్షనరీతో కూడిన కిట్‌లను అందజేస్తారని వివరించారు. వీటితోపాటు యూనిఫారం కుట్టు ఛార్జీలను విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు. కలెక్టర్ వెంట సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి.శ్యామ్‌సుందర్, జిల్లా హార్టికల్చర్ అధికారి ఎ.దుర్గేష్, జిల్లా పంచాయతీ అధికారి జివి.మల్లికార్జునరావు, అధికారులు పాల్గొన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలపై సిపిఎం నిరసన

ప్రజాశక్తి - పాలకొల్లు

వినతిపత్రం అందిస్తున్న నేతలు

అప్రకటిత కరెంటు కోతలు ఆపాలని సిపిఎం నేత దిగుపాటి రాజగోపాల్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేసి టెక్నీషియన్ సతీష్ ద్వారా అసిస్టెంట్ ఇంజినీర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ కరెంటు కోతలతో వృద్ధులు, పిల్లలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం కరెంటు ఛార్జీలు, ట్రూఅప్ ఛార్జీల భారం వేస్తున్నా వినియోగదారులను కోతల పేరుతో ఇబ్బందులు పెట్టడం సరైంది కాదన్నారు. విద్యుత్ సంస్కరణల పేరుతో కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్‌తో మరింత భారం మోపనుందన్నారు. ఉత్పత్తి కేంద్రాలు ప్రయివేటు పరం చేసి పెట్టుబడిదారులకు అనుకూలంగా సంస్కరణలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం చెప్పినట్లు వింటూ బిల్లుల మోత మోగిస్తుందని విమర్శించారు. ఒకపక్క ఎండ వేడి, ఉక్కపోతలు, మరోపక్క కరెంటు కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కరెంటు కోతల నివారణకు చర్యలు తీసుకోవాలని రాజగోపాల్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాసరావు, నేతలు చల్లా సోమేశ్వరరావు, వై.అజయ్‌కుమార్, టి.శ్రీనివాసరావు, గుబ్బల సత్యనారాయణ, అరుణ్, పురుషోత్తం, ఐ.రాజు, పి.రామారావు, జి.శ్రీరాములు, ఎం.సంపత్‌రావు పాల్గొన్నారు.

నూక పేరుతో దోపిడీని అరికట్టాలి

ఏపి కౌలురైతు సంఘం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - వీరవాసరం

కష్టాల్లో ఉన్న రైతులను నూక, తేమశాతం పేరుతో మిల్లర్లు చేస్తున్న దోపిడీని అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మత్స్యపురి ఆర్‌బికె వద్ద ధర్నా నిర్వహించారు. ధాన్యం కొనుగోలు సమయంలో 1153, 1156 రకం ధాన్యం పట్టుబడి సమయంలో ముక్క, తేమ శాతం పేరుతో అదనంగా రెండు కేజీలు పట్టడంపైనా, మిల్లర్లు రైతుల నుండి ఎదురు డబ్బులు అడగటంపైనా రామాంజనేయులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మిల్లర్లకు తలొగ్గిన అధికారులు రైతులకు నష్టం కల్గించేలా వ్యవహరించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ రకం ధాన్యమైనా రైతుల నుండి ఒక సంచికి ఒక కేజీ మాత్రమే తీసుకోవడం జరుగుతుందని జిల్లా అధికారులు తెలుపుతుంటే వీరవాసరం వ్యవసాయాధికారులు మాత్రం సంచికి రెండు కేజీలు అదనంగా తీసుకుంటున్నారన్నారు. ఈ లెక్కన క్వింటాకు రూ.120 వరకు రైతు నష్టపోతున్నాడని తెలిపారు. ఈ విషయం ఆర్‌డిఒ దాసి రాజు దృష్టికి తీసుకెళితే రైతులను ఇబ్బంది పెట్టే వారి పై చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతులు చింతా నారాయణమూర్తి, ముచ్చర్ల వీరప్రభాకరరావు, చింతా సూర్యనారాయణ, నిప్పులేటి అప్పారావు, పిప్పళ్ల నాని, రావూరి సూర్యనారాయణ, గంటా ఆంజనేయులు, ఈర్ల బాబ్జి, పుప్పాల పాములు పాల్గొన్నారు.

నినదిస్తున్న రైతులు, నేతలు



గేటు వద్ద నిలిచిన వాహనాలు

మొరాయించిన రైల్వేగేటు

వాహనదారులకు అవస్థలు

ప్రజాశక్తి - ఉండి

రైల్వే గేటు తీయడంలో సాంకేతిక సమస్యలు ఏర్పడటంతో సుమారు రెండు గంటలపాటు ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడిన ఘటన శనివారం ఉండిలో చోటుచేసుకుంది. ఉండి రైల్వే గేటు శనివారం మధ్యాహ్నం మొరాయించింది. గేటును తెరిచే సామగ్రి అందుబాటులో లేకపోవడంతో భీమవరం నుంచి రప్పించి ఎట్టకేలకు రెండు గంటల అనంతరం రైల్వే సిబ్బంది గేటు తీశారు. మండుటెండలో జనం ఉక్కిరిబిక్కిరయ్యారు.

సమస్యలు పరిష్కరించాలని వైద్యఉద్యోగుల వినతి

పాలకొల్లు: వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని పలువురు ఎన్‌జిఒ నేతలు డిఎంహెచ్‌ఒకు వినతిపత్రం సమర్పించారు. వైద్యఆరోగ్య శాఖలో సమస్యలను పరిష్కరించాలని పాలకొల్లు ఎన్‌జిఒ యూనిట్ అధ్యక్షులు గుడాల హరిబాబు, నర్సాపురం ఎన్‌జిఒ యూనిట్ కార్యదర్శి కెబికెఎస్.రమేష్‌రెడ్డి, కోశాధికారి రాజేష్, పూర్వపు అధ్యక్షులు కృష్ణకుమార్, కొంగరపు అప్పారావు, ఆరోగ్య కార్యకర్తలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ డి.మహేశ్వరావుకు శనివారం భీమవరంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను వివరించగా వాటిని త్వరలో పరిష్కరిస్తామని డిఎంహెచ్ఒ హామీ ఇచ్చారని హరిబాబు తెలిపారు.

ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా పనిచేయాలి

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. శనివారం స్థానిక ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో నాడు-నేడు పాఠశాల అభివృద్ధి, 'గడప గడపకు మన ప్రభుత్వం' ద్వారా మంజూరైన పనుల పురోగతిపై పంచాయతీరాజ్, పురపాలక సంఘం అధికారులతో నియోజకవర్గ స్థాయి ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పన కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని, పట్టణంలో పార్కుల సుందరీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. నాడు-నేడు పాఠశాలల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు అధికారులు,

ఉపాధి పనులు పాత పద్దతిలో చేయించాలి

పనుల సందర్శనలో నేతలు

ప్రజాశక్తి - అత్తిలి

మాట్లాడుతున్న గోపాలన్, వీరభద్రరావు

ఉపాధి హామీ పనులు పాత పద్దతిలో కొలతల ప్రకారమే చేయించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు, ఎపి కౌలురైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బల్లిపాడు, ఉరదాళ్లపాలెం గ్రామాల్లో పని చేస్తున్న కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో పని ప్రదేశంలో తాగునీరు, మజ్జిగ, పనిముట్లు ఇచ్చేవారని, ప్రస్తుతం అటువంటి సౌకర్యాలు ఏమీ కన్పించడం లేదని కూలీలు వాపోయారు. ఈ సందర్భంగా వీరభద్రరావు, గోపాలన్ మాట్లాడుతూ వేసవి ఎండలు పెరుగుతున్నందున కూలీలు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని, రెండుపూటలా ఫొటో హాజరు రద్దు చేయాలని కోరారు. గడిచిన తొమ్మిదేళ్లుగా కేంద్రంలో మోడీ ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో కోతలు పెడుతూ పేదలను మోసగిస్తూ ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. అందులో భాగంగానే సమ్మర్ అలవెన్స్ తొలగించారని, పే స్లిప్‌లు సకాలంలో ఇవ్వడం లేదని, మజ్జిగ పంపిణీ ఆపేశారని, చట్టప్రకారం వంద రోజులు పని పూర్తి చేసిన గ్రూపులకు పనిముట్లు ఇవ్వడం లేదని గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా వామపక్షాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు చేసిన పోరాటాల ఫలితంగా వచ్చిన ఉపాధి హామీని కూలీలంతా ఐకమత్యంతో కాపాడుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాజాని వెంకట ఉదయకుమారి, విత్తంశెట్టి వెంకటలక్ష్మి, పెచ్చెట్టి లక్ష్మీదుర్గ, మెరిపే వేణు, వేంద్ర లక్ష్మి పేరంటాలు, చదలవాడ జయలక్ష్మి, కుక్కల కుమారి, వేంద్ర మాధవి తదితరులు పాల్గొన్నారు.

నాడు తండ్రి... నేడు తనయుడు

రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నేడు పాతపాటి శ్రీనివాసరాజు ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - కాళ్ల

పార్టీ పట్ల విధేయతతో పని చేయడం, రాజకీయాల్లో రాణించడం కత్తి మీద సాములాంటిదే. అయినా వెరవకుండా బాధ్యతాయుతంగా తండ్రి పాతపాటి సర్రాజు అడుగుజాడల్లో పయనిస్తూ అందొచ్చిన అవకాశాలను వినియోగించుకుంటూ ఎదిగారు పాతపాటి వెంకట శ్రీనివాసరాజు (వాసు). కాంగ్రెస్ పార్టీలో చేరి రాజకీయాల్లోకి అడుగుపెట్టిన శ్రీనివాసరాజు ఆ తర్వాత వైసిపి ఆవిర్భావం నుంచి తన తండ్రి సర్రాజు వెన్నంటే ఉంటూ వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలోనూ అడుగు కలిపారు. 2021లో వైసిపి ప్రభుత్వం ఉండి మాజీ ఎంఎల్ఎ పాతపాటి సర్రాజుకు రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పదవిని కట్టబెట్టింది. పాతపాటి శ్రీనివాసరాజు తండ్రి పాతపాటి సర్రాజు 2004లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి ఎంఎల్ఎగా గెలుపొందారు. 2009లో కాంగ్రెస్ తరపున, 2014లో వైసిపి నుంచి ఎంఎల్ఎ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2019లో వైసిపి ప్రభుత్వం ఏర్పడ్డాక 2021లో సర్రాజుకు నామినేటెడ్ పదవి దక్కింది. ఆయన ఆ పదవిలో ఉండగానే ఈ ఏడాది ఫిబ్రవరిలో గుండెపోటుతో ఆకస్మికంగా మరణించిన సంగతి తెలిసిందే.

ఆ సందర్భంగా సిఎం జగన్మోహన్‌రెడ్డి పాతపాటి సర్రాజు తనయులకు సముచిత ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు పాతపాటి సర్రాజు పెద్ద కుమారుడు పాతపాటి శ్రీనివాసరాజుకు రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పదవిని జగన్ కట్టబెట్టారు. కాళ్ల మండలం జక్కరం గ్రామానికి చెందిన పాతపాటి వెంకట శ్రీనివాసరాజు వైసిపిలో క్రియాశీలంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 14న విజయవాడలో క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్‌గా శ్రీనివాసరాజు ప్రమాణస్వీకారం చేయనున్నారు. వెంకటేశ్వరరావు రెసిడెన్సీలో అదే రోజు క్షత్రియ కార్పొరేషన్ కార్యాలయాన్ని కూడా ప్రారంభించనున్నారు.

నాలుగో రోజు కొనసాగిన రైతుల నిరసన

ప్రజాశక్తి - పాలకోడేరు

నినదిస్తున్న రైతులు

ఇళ్ల స్థలాలకు భూములిచ్చిన తమకు నష్టపరిహారం చెల్లించాలంటూ రైతు కుటుంబాలు నాలుగో రోజు శనివారం నిరసన కొనసాగించాయి. గ్రామానికి చెందిన కారింకి సత్యనారాయణ, నల్లి రామలక్ష్మి, సంబలదీవి సాయి ఒకొక్కరూ అరెకరం చొప్పున మొత్తం 1.50 ఎకరాల భూమిని ఇళ్ల స్థలాలకు ఇచ్చిన విషయం తెలిసిందే. ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వానికి ఇచ్చిన భూములు గతంలో నిరుపేదలకు ఎసైన్డ్ చేయబడినవి కావడం, వాటిని వీరు కొనుగోలు చేసి సాగు చేస్తుండటంతో పిఒటి యాక్ట్ ప్రకారం రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వలేదు. నష్ట పరిహారం కోసం 2020 నుంచి ఎంత మంది అధికారుల వద్దకు తిరిగినా ఫలితం లేకపోవడంతో వారంతా కొద్ది రోజులుగా ఆ భూముల వద్ద నిరసన చేపట్టారు. వీరికి స్థానిక వ్యకాస, ప్రజాసంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు.

ఉండిలో వైసిపి జెండా ఎగురవేస్తాం

సిఎం జగన్‌కు రుణపడి ఉంటా - రాష్ట్ర క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి వెంకట శ్రీనివాసరాజు (వాసు)

ప్రజాశక్తి - కాళ్ల

ఉండి నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పని చేసి రానున్న ఎన్నికల్లో వైసిపి జెండా ఎగురవేస్తామని రాష్ట్ర క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి వెంకట శ్రీనివాసరాజు (వాసు) అన్నారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ తమ కుటుంబంపై ఆదరాభిమానాలు చూపుతూ తమ వెన్నంటే ఉంటున్న కార్యకర్తలకు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. తన తండ్రి పాతపాటి సర్రాజు చేపట్టిన క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పదవిని తనకు కట్టబెట్టడం ద్వారా సిఎం జగన్మోహన్‌రెడ్డి తమ కుటుంబానికి ఎనలేని గుర్తింపునిచ్చి అండగా నిలిచారని కృతజ్ఞతలు తెలిపారు. నాడు వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాం నుంచి తమ కుటుంబానికి పలు సందర్భాల్లో ప్రాధాన్యతినిస్తూనే ఉన్నారన్నారు. రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం కూడా జగన్మోహన్‌రెడ్డి తమ కుటుంబం వెన్నంటే ఉన్నారని తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన అనంతరం తన తండ్రి సర్రాజును గుర్తించి రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి కట్టబెట్టి రాష్ట్రంలోని క్షత్రియులందరికీ సేవ చేసే భాగ్యాన్ని కల్పించారన్నారు. అయితే ఆయన మరణానంతరం ఆ పదవిని మా కుటుంబానికే ఇవ్వాలనే ఆలోచనతో తనకు అవకాశం కల్పించారని కృతజ్ఞతలు తెలిపారు. తన తండ్రి పాతపాటి సర్రాజు నిర్వహించిన పదవిలో తనను నియమించడం సంతోషంగా ఉందన్నారు. వైసిపి బలోపేతానికి కృషి చేస్తానన్నారు. నామినేటెడ్ పదవులన్నీ అన్ని సామాజిక తరగతులకు కేటాయించడంతోపాటు మహిళలకు ప్రాధాన్యత ఇచ్చిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అగ్రవర్ణాల్లోని పేదలకు తమ ప్రభుత్వం అండగా ఉండి వారి సంక్షేమానికి పెద్ద పీట వేసిందన్నారు. క్షత్రియుల్లో కూడా పేదలున్నారని, వారికి అండగా ఉండి ఆదుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తలచి క్షత్రియ కార్పొరేషన్ ఏర్పాటు చేశారన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ, ఏ ముఖ్యమంత్రి కూడా క్షత్రియ కార్పొరేషన్‌పై ఆలోచన చేయలేదన్నారు. అన్ని తరగతులకు సముచిత స్థానం కల్పించి ముఖ్యంగా అగ్రవర్ణాల్లోని పేదలను దృష్టిలో పెట్టుకుని కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానిదేనన్నారు. ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద క్షత్రియులను దృష్టిలో పెట్టుకుని క్షత్రియ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రథమ ఛైర్మన్‌గా తన తండ్రి పాతపాటి సర్రాజు పని చేయడం, ఆ పదవి తాను చేపట్టబోతుండటం తమకు ఎంతో గర్వకారణంగా ఉందన్నారు.



జగన్ పాదయాత్రలో సర్రాజు, వాసు (ఫైల్‌ఫొటో)

సిఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పాతపాటి శ్రీనివాసరాజు, వర్మ

లంకభూముల్లో అక్రమ తవ్వకాలు నిరసిస్తూ

15న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

చించినాడలో దళితుల లంక భూముల్లో అక్రమ తవ్వకాలను నిరసిస్తూ ఈ నెల 15న జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న ధర్నాకు తరలిరావాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, ఎస్‌సి, బిసి గోదావరి డి.ఫారం పట్టా భూముల డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు గొల్ల ఏడుకొండలు శ్రీనివాస్, కేతా రాము పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం వారొక ప్రకటన విడుదల చేశారు. యలమంచిలి మండలం చించినాడ గ్రామంలో దళిత పేద కుటుంబాలకు చెందిన లంక భూముల్లో అధికారులు అక్రమ తవ్వకాలు చేయడం దారుణమని పేర్కొన్నారు. గతంలో 60 ఎకరాలు భూములకు 1983లో ప్రభుత్వం పట్టాలిచ్చిందని తెలిపారు. ఈ క్రమంలోనే గోదావరి వల్ల పెరుగు భూమి 10 ఎకరాలు పెరిగిందని తెలిపారు. ఈ భూమిని పేద దళిత కుటుంబాలు ఉపయోగించుకుంటున్నాయని పేర్కొన్నారు. అక్కడ భూస్వాములు, అధికారులు అక్రమంగా ఆ 10 ఎకరాలు భూమిని తవ్వి మట్టిని తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూస్వాముల చేతుల్లో ఉన్న వందలాది అక్రమ

ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న సర్పంచి

ఉపాధి హామీ చట్టం.. పేదలకు వరం

ప్రజాశక్తి - ఆచంట

ఉపాధి హామీ చట్టం పేదల పాలిట వరమని సర్పంచి సుంకర సీతారామ్ అన్నారు. కొడమంచిలి చినపేటలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను స్థానిక వార్డు మెంబర్ పుచ్చకాయల నాగార్జునతో కలిసి ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచి సీతారామ్ మాట్లాడుతూ ఎండలు అధికంగా ఉన్నందున కూలీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఎక్కువ పని దినాలు మన గ్రామంలో నమోదైతే అత్యధిక నిధులు రావడానికి దోహద పడతాయన్నారు. గ్రామంలో ప్రతి కుటుంబం ఉపాధి హామీ పుస్తకం కలిగి ఉండాలని కోరారు. అమృత్ సరోవర్ పథకంలో భాగంగా చినపేట మంచినీటి చెరువును బాగు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ కోటే శశి మధు, కూలీలు పాల్గొన్నారు.

గోనెసంచులు అందక రైతులకు నష్టం

ప్రజాశక్తి - పెనుమంట్ర

గోనెసంచుల కొరత వల్ల రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కూసంపూడి సుబ్బరాజు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల జరిగిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో రైతుల సమస్యలపై చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారా అని ప్రశ్నించారు. అధికారులు స్పందించి రైతులు ఎదర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు.



అన్నసమారాధనలో వడ్డన చేస్తున్న ఎంఎల్ఎ రామరాజు

కాళ్లకూరులో అఖండ అన్నసమారాధన

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని కాళ్లకూరు గ్రామంలో వెంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవంలో భాగంగా దాతలు, యాత్రికుల సహకారంతో శనివారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. శనివారం కాళ్లకూరు వెంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. దేవస్థాన స్థలంలో అన్న సమారాధన నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఛైర్మన్ దండు వెంకటకృష్ణంరాజు, మరికొంతమంది దాతలు యాత్రికుల సహకారంతో అఖండ అన్నసమారాధన నిర్వహించామని ఆలయ ఇఒ ఎం.అరుణ్‌కుమార్ తెలిపారు. ఉండి ఎంఎల్ఎ రామరాజు, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు అన్న సమారాధనలో యాత్రికులకు స్వయంగా అన్నం వడ్డించారు.

కొత్తపాలెంలో...

మొగల్తూరు :మండలంలోని కొత్తపాలెం గ్రామంలో ఉన్న సత్తెమ్మ ఆలయ ప్రాంగణంలో శనివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. అమ్మవారి జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు. యాత్రికులకు ఎటువంటి సౌకర్యాలు కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

నేరాలు - ఘోరాలు

రైలు దిగుతూ జారిపడి యువకుడు మృతి

ప్రజాశక్తి - తణుకు

రైలు దిగుతూ ప్రమాదవశాత్తూ జారిపడి యువకుడు మృతి చెందిన సంఘటన తణుకు రైల్వే స్టేషన్‌లో శనివారం చోటు చేసుకుంది. పెరవలి మండలంలోని నల్లాకులవారిపాలేనికి చెందిన నాగ మణికంఠ కాకినాడ నుంచి తణుకు సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరాడు. ఈ క్రమంలో తణుకులో రైలు ఆగుతుండగా దిగేందుకు ప్రయత్నించి జారి రైలు కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సర్కార్ ఎక్స్‌ప్రెస్ తణుకు స్టేషన్‌లో సుమారు 30 నిమిషాల పాటు నిలిచిపోయింది.

గంజాయి సేవిస్తున్న యువకులు అరెస్టు

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరంలో గంజాయి సేవిస్తున్న పలువురు యువకులను వీరవాసరం పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం వీరవాసరం పోలీస్ స్టేషన్‌కు వచ్చిన సమాచారం మేరకు సదరు యువకులు గంజాయి సేవిస్తున్న ప్రాంతానికి వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ తెలిపారు. వీరవాసరం రైల్వే గేటు సమీపంలో అన్నపూర్ణ లాజిస్టిక్ గిడ్డంగుల వద్ద ఏడుగురు యువకులను సోదా చేయగా వారి వద్ద 90 గ్రాముల గంజాయి ఉన్నట్లు గుర్తించామన్నారు. వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు, బైక్

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని వేడంగిలో ఐస్ ఫ్యాక్టరీ వద్ద ప్రధాన రహదారిపై శనివారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో పలువురు గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పాలకొల్లు నుంచి మార్టేరు వైపుగా వస్తున్న ఓ కారు ఎదురుగా వస్తున్న బైక్‌ను, ఆటోను బలంగా ఢీ కొట్టింది. దీంతో కారుతో పాటు బైక్, ఆటో మూడూ సమీపంలోని పొలాల్లోకి దూసుకెళ్లాయి. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ప్రయాణికులు, బైక్‌పై ఉన్న వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను స్థానికులు ఆసుపత్రికి తరలించారు.

భర్త కన్పించడం లేదని భార్య ఫిర్యాదు

ప్రజాశక్తి - పాలకోడేరు

తన భర్త ప్రేమానందం ఈ నెల తొమ్మిదో తేదీ నుంచి కనిపించడంలేదని వేండ్ర గ్రామానికి చెందిన ఎన్.ప్రసన్నసుజాత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు హెడ్ కానిస్టేబుల్ ధనుంజయరావు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99180
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అప్రకటిత విద్యుత్ కోతలు ప్రజల అవస్థలు



ఆకివీడుకు విద్యుత్ సరఫరా చేస్తున్న సబ్‌స్టేషన్

ప్రజాశక్తి - ఆకివీడు

మండలంలో విద్యుత్ కోత సర్వ సాధారణం అయిపోయింది. ఇక్కడ అప్రకటిత విద్యుత్ కోత నిరంతరంగా కొనసాగుతోంది. వేళ పాళ, రాత్రి పగలు తేడా లేకుండా కోత విధిస్తున్నారు. గత నాలుగు ఐదు రోజులుగా ప్రతిరోజు 15 నుంచి 18 గంటలు విద్యుత్ కోత విధిస్తున్నారు. కరెంటు ఎంతసేపు తీస్తాడో, ఎప్పుడు తీస్తారో తెలియదు. ఇంట్లో కార్యక్రమాలకు గాని, వంట కార్యక్రమాలకు గాని కరెంటు దొరికే పరిస్థితి లేదు. ఇక మంచినీళ్ల పరిస్థితి సరేసరి. రోజు మొత్తంలో కరెంటు లేకపోవడంతో కుళాయి మంచినీళ్లు ఎప్పుడొస్తాయో తెలియని పరిస్థితి. ఇది సాధారణ గృహస్థుల పరిస్థితి. వేసవిలో విద్యుత్ లేకపోవడంతో కరెంటు లేక గాలి లేక సాధారణ ప్రజానీకం నానా అవస్థలు పడుతున్నారు. ఇక ఆసుపత్రుల్లో రోగుల పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. ఇదిలా ఉండగా విద్యార్థుల పరిస్థితి అయోమయంగా మారింది. ఇంటర్మీడియట్, పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలు ఉన్నాయి. పరీక్షలకు హాజరయ్యేందుకు విద్యార్థులు రాత్రి పగలు చదువుకునే పరిస్థితి. ఎండ వేడిమి తాళలేక ఫ్యాను గాలి లేక పుస్తకం తీసి చదవలేని పరిస్థితి. ఇక రాత్రులు చదవడానికి కరెంటు ఉండదు. గత నాలుగు రోజులుగా సాధారణ ప్రజానీకం విద్యుత్ శాఖ కార్యాలయానికి తరచూ జట్లు జట్లుగా వెళ్లి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర విధుల్లో ఉన్న సిబ్బంది మాత్రమే ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు.

ఆక్వా రైతుల ఆవేదన

కరెంటు సమస్య పెరిగిపోవడంతో చెరువులో ఉండే ఫ్యాన్లు తిరక్క రొయ్యలకు ఆక్సిజన్ అందటం లేదని ఆక్వా రైతులు వాపోతున్నారు. ఒకపక్క భారీ స్థాయిలో ఎండలు కాస్తుంటే అక్కడక్కడ రొయ్యలు చెదురు మాదిరిగా చనిపోతున్నాయి. మరోపక్క చేపల ఎగుమతికి అవసరమైన ఐసు ధర మరింత పెరిగిపోయే ప్రమాదం ఉందని చేపల రైతులు ఆందోళన చెందుతున్నారు.

సమాధానం చెప్పని అధికారులు

కరెంటు కోతపైన అధికారుల కోసం ఫోన్ చేసే వారికి పూర్తి నిరాశ మిగులుతుంది. విద్యుత్ కోత ఎంతసేపు ఉంటుందో తెలుసుకునే ప్రయత్నం చేస్తే ఏ ఒక్కరూ ఇక్కడ ఫోన్ ఎత్తరు. కరెంట్ ఆఫీసులో గాని అధికారులు వ్యక్తిగత ఫోన్లు గాని ఏ ఒక్కరూ సమాధానం చెప్పే పరిస్థితి లేదు. కరెంట్ ఆఫీస్‌కి ఎవరూ వెళ్లిన అధికారులు ఫీల్డ్‌లో ఉన్నారన్నదే అక్కడ సమాధానం. ఫోన్‌లోను దొరకరు కార్యాలయాల్లోనూ దొరకరు కరెంట్ ఎందుకు తీస్తున్నారో తెలవదు. అధికారికంగా మాత్రం కరెంటు కోతలేదని చెబుతున్నారు.

కేసుల రాజీతో ఇరు పక్షాలకు విజయం

తాడేపల్లిగూడెంలో....

ప్రజాశక్తి- తణుకు రూరల్

స్థానిక కోర్టు ఆవరణలో నాలుగో అదనపు జిల్లా జడ్జి (ఫుల్ అడిషనల్ చార్జి) పి.అన్నపూర్ణ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 255 కేసులను రాజీ చేశారు. మూడు బెంచ్‌లుగా ఏర్పాటు చేసిన జాతీయ లోక్‌అదాలత్‌లో సివిల్ కేసులు 29, క్రిమినల్ కేసులు 76, పెట్టీ కేసులు 130, ప్రీలిటిగేషన్ బిఎస్ఎన్ఎల్, బ్యాంకు కేసులు 18 రాజీ చేశారు. ఈ అదాలత్‌లో 1972వ సంవత్సరంలో ఉన్న సివిల్ దావాలోని ఈపి, 52 సంవత్సరాలు తరువాత రాజీ పడింది. ఈ కార్యక్రమంలో నాలుగో అదనపు జిల్లా జడ్జి పి.అన్నపూర్ణ, సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణసత్యలత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.సాయిరామ్, అడ్వకేటులు జెఆర్‌విఎఎస్. పవన్‌కుమార్, ఎం.సుబ్బయ్య, డి.కృష్ణకుమారి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సూరంపూడి కామేష్, న్యాయవాదులు పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లు న్యాయస్థానాల సముదాయంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. లోక్ అదాలత్‌లో పలు కేసులను రాజీ చేసుకొని తమ కేసులను పరిష్కరించ ుకున్నారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వరలక్ష్మి సారధ్యంలో మొత్తం 560 కేసులు పరిష్కరించారు.

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం కోర్టు భవనాల ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 695 కేసులు పరిష్కరించినట్లు తాడేపల్లి గూడెం సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్ బాబు, తాడేపల్లి గూడెం బార్ అధ్యక్షులు కె.అప్పిరెడ్డి తెలిపారు. కక్షిదారులు లోక్ అదాలత్‌లో కేసులు రాజీ కుదుర్చుకోవడం ద్వారా సమ యం, డబ్బు ఆదా అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సూర్యకిరణ్, రెండో అడి షనల్ జూనియర్ సివిల్ జడ్జి అన్నామణి, తాడేపల్లిగూ డెం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.అప్పిరెడ్డి, పట్టణ సిఐ నాగ రాజు, రూరల్ సిఐ మూర్తి, న్యాయవాదులు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్‌లో...

నరసాపురం టౌన్ : మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సంస్థ ఛైర్మన్, పదో అదనపు జిల్లా జడ్జి పి.విజయదుర్గ అధ్యక్షతన పెండింగ్, ప్రీ లిటిగేషన్ కేసుల పరిష్కార నిమిత్తం నరసాపురం కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో మూడు బెంచ్‌లు ఏర్పాటు చేశారు. మొదటి బెంచ్‌కు న్యాయమూర్తిగా పదో అదనపు జిల్లా జడ్జి విజయదుర్గ, సభ్యునిగా న్యాయవాది నక్కా కుమార్‌రత్నం, రెండో బెంచ్‌కు న్యాయమూర్తిగా సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు, సభ్యునిగా న్యాయవాది సిహెచ్.జ్యోతి, మూడో బెంచ్‌కు న్యాయమూర్తిగా ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాస్, సభ్యునిగా న్యాయవాది డి.సుభాష్‌బాబు వ్యవహరించారు. కక్షిదారులకు సీనియర్ న్యాయవాది కె.స్వామినాయుడు ఫ్రైడ్ రైస్ ఏర్పాటు చేశారు. జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు 5, క్రిమినల్ కేసులు 668, బ్యాంకు, బిఎస్ఎన్ఎల్ మొండి బకాయి కేసులు 18 మొత్తం 691 కేసులు రాజీ అయ్యాయి.

మజ్జిగ చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం : పివిఎల్



కాళ్ల : చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ అందిస్తున్న పివిఎల్

ప్రజాశక్తి - కాళ్ల

వేసవి దాహార్తిని తీర్చడానికి మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు వంటి కార్యక్రమాలు చేయడం ఎంతో సంతోషదాయకమని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. పెదఅమిరం గ్రామంలో గ్రామపంచాయతీ సహకారంతో సర్పంచి డొక్కు సోమేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రాన్ని పివిఎల్.నరసింహరాజు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పివిఎల్ నరసింహరాజు మాట్లాడుతూ వేసవిలో వాహనదారులకు, పాదచారులకు మజ్జిగ చలివేంద్రాలు ఎంతో దోహదపడుతున్నాయన్నారు. సర్పంచి డొక్కు సోమేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రజలకు అందుబాటులో ప్రధాన రహదారి వెంబడి మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచి జవ్వాది లీలా కిషోర్, పార్టీ గ్రామ అధ్యక్షులు వేగేశ్న జయ రామకృష్ణంరాజు, సత్యనారాయణ, నడింపల్లి సుబ్బరాజు, జైకృష్ణ పాల్గొన్నారు.

గణపవరం : వేసవిలో బాటసారులకు దాహార్తిని తీర్చే చలివేంద్రాలు ఏర్పాటు చేయడం హర్షణీయమని వైసిపి మండల కన్వీనర్ దండు రాము అన్నారు. స్థానిక బస్టాండ్ వద్ద స్నేహ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో వర్కర్స్ యూనియన్ కార్మికుల సమస్యల పరిష్కారంతో పాటు సమాజ సేవలో కూడా భాగం పంచుకోవడం సంతోషకరమన్నారు. మొదటి రోజు గణేష్ రెస్టారెంట్ వారి సౌజన్యంతో రస్నా అందించారు.

పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని ప్రముఖ వైద్యులు గంధం విశ్వేశ్వరరావు అన్నారు. భీమవరం డాక్టర్ వైఎస్ఆర్ శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాల్లో యోగా, చిత్రలేఖనం, నృత్యాలపై శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరావు మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పూజ్యశ్రీ గురువులు రవి శంకర్ జయంతి, యోగా జాతీయ సమైక్యత ప్రతిజ్ఞ నిర్వహించామని, డాక్టర్ గంధం విశ్వేశ్వరరావు సహకారంతో బాలలకు డ్రాయింగ్ బుక్స్, విద్యా సామగ్రి, స్వీట్స్ పంపిణీ చేశామని తెలిపారు. గ్రంథాలయ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వచ్చే నెల 11వ తేదీ నిర్వహించే వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అరసవల్లి సుబ్రహ్మణ్యం, కలిగోట్ల గోపాలశర్మ, తుమ్మలపల్లి బాలాజీ, డి.శ్యామ్, కె.శ్యామల, ఎన్.లక్ష్మి పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ :నరసాపురం ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో శనివారం పిల్లలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. చందమామ కథలు, నీతి కథలు విద్యార్థులతో చదివించి చెప్పించారు. అనంతరం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖపట్నం కెజిహెచ్ వైద్యురాలు స్పందన వైద్య సేవలందించారు. అనంతరం తెలుగు టూ ఇంగ్లీష్ ట్రాన్స్‌లేషన్ క్లాస్, కెరీర్ గైడెన్స్, జికె క్లాసులు, పద్యాలు, యోగా క్లాసులు మెడిటేషన్ గేమ్స్ పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. బార్క్ శాస్త్రవేత్త సుబ్బారావు, సిహెచ్.శ్రీనివాస్, వాసు, సూర్యం బాబు, తోట శ్రీనివాస్, జీవన్‌కుమార్, ప్రిన్స్, ప్రవీణ్, భట్టిప్రోలు సత్యనారాయణ పాల్గొన్నారు. సుధీర్ మోహన్ పిల్లలకు స్నాక్స్, కూల్ డ్రింక్స్ పంపిణీ చేశారని గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కెజెఎస్ ఎల్ కుమారి తెలిపారు.

నరసాపురం టౌన్‌లో..

ఉండి : యోగాసనాలతో ఆరోగ్యంగా ఉంటారని యోగా ఉపాధ్యాయురాలు వి.విశ్వజ్యోతి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం ఉండి శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జెవి.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

కర్ణాటకలో విజయంపై కాంగ్రెస్ నాయకుల హర్షం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కర్ణాటక రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 136 స్థానాల్లో విజయం సాధించిన సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మార్నీడి బాబ్జి ఆధ్వర్యంలో శనివారం స్థానిక పోలీస్ ఐలాండ్ సెంటర్‌లో బాణసంచ కాల్చి స్వీట్స్ పంచి సంబరాలు జరిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు బాలబొమ్మల శ్రీనివాస్, పాలూరి శ్రీనివాస్, అకిన సాయిబాబా, ఎన్.అప్పా రావు, పజ్జూరి రామారావు, ఎం.శ్రీనివాస్, పాల్గొన్నారు.

పాలకొల్లు : కర్ణాటకలో కాంగ్రెస్ ఘన విజయం సాధించడం పట్ల పాలకొల్లు నియోజవర్గ కాంగ్రెస్ నేతలు పట్టణంలో శనివారం బాణసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. పాలకొల్లు పాత బస్టాండ్ సెంటర్ వద్ద పిసిసి సభ్యులు మహమ్మద్ జానీ, రాష్ట్ర బిసి సంఘం నేతలు కొలుకులూరి అర్జున్‌రావు సారథ్యంలో కాంగ్రెస్ నేతలు సంబరాలు చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని, రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని చెప్పారు.

కాళ్ల :కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించిన సందర్భంగా రాష్ట్ర పిసిసి కో-ఆర్డినేటర్ అంకెం సీతారామ్ ఆధ్వర్యంలో కాళ్లలో శనివారం స్వీట్లు పంపిణీ చేశారు. కాళ్ల గ్రామంలో తీన్‌మార్ డప్పులతో ర్యాలీ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు మాట్లాడుతూ కర్ణాటకలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 136 స్థానాలు అత్యధిక స్థానాలు గెలుపొందడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సోము నాగకేశవ బాబు, బొర్రా పార్థు, బొట్టా శ్రీనివాస్, కొల్లి శ్రీనివాస్, శివ బాబు, బొర్రా సాయివెంకట రమణ, అంకెం కార్తీక్ పాల్గొన్నారు.

సిబిఎస్ఇ విద్యార్థులకు ఎంఎల్ఎ అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఎల్ఎ వాసుబాబు

ప్రజాశక్తి - గణపవరం

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన శ్రీ చైతన్య సిబిఎస్ఇ పాఠశాల విద్యార్థులను ఎంఎల్ఎ పుప్పాల శ్రీనివాసరావు శనివారం అభినందించారు. స్థానిక పాఠశాలలో విద్యార్థులకు శనివారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ వాసుబాబు మాట్లాడుతూ విద్యార్థులు అభ్యున్నతికి సిబిఎస్ఇ పాఠశాల ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని అభినందించారు. పాఠశాల ప్రిన్సిపల్ పి.రామ్‌ప్రకాష్ మాట్లాడుతూ సిహెచ్.నవ్యశ్రీ 469 మార్కులతో ప్రథమస్థానం, జి.పార్థు 400తో ద్వితీయస్థానం, హాసిని 426తో తృతీయస్థానం, ఎ.కీర్తన 425తో నాలుగో స్థానం, వి.అను 413తో ఐదో స్థానంలో నిలిచారని తెలిపారు. వీరిని ఎంఎల్ఎ వాసుబాబు, పాఠశాల ఎజిఎం వైఎన్.శ్రీనివాస్, రీజియన్ ఇన్‌ఛార్జి ఎం.పార్థసారథి, ఎ.రామారావు, పదో తరగతి ఇన్‌ఛార్జి రామకృష్ణ అభినందించారు.

అందుబాటులోకి ముక్క శాతం లెక్కించే మినీ మిల్లర్

ప్రజాశక్తి - వీరవాసరం

ప్రస్తుతం దాళ్వా ధాన్యం అమ్మకంలో రైతులు ఎదుర్కొంటున్న ముక్క శాతం పరిశీలించుకోవడానికి వీరవాసరం తహాశీల్దార్ కార్యాలయం మినీ మిల్లర్ అందుబాటులోకి తీసుకొచ్చినట్లు మండల వ్యవసాయాధికారి గీతాదేవి శనివారం తెలిపారు. ఈ మినీ మిల్లులో రైతులు తమ ధాన్యాన్ని ముక్క శాతాన్ని పరిశీలించుకోని నాణ్యత నిర్ధారించుకోవచ్చని తెలిపారు. రైతులు తమ ధాన్యం నాణ్యత పట్ల అనమానాలు ఉంటే ముందుగా ఇక్కడకు నమూనా ధాన్యాన్ని తీసుకువచ్చి ఆర్‌బికె విలేజ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్ వారి సమక్షంలో పరిశీలించుకోవాలని తెలిపారు.

రాంబాబు సేవలు అభినందనీయం

పాలకోడేరు : వేసవిలో మజ్జిగతో ప్రజల దాహార్తిని తీరుస్తున్న కామన రాంబాబు సేవలు అభినంద నీయమని గొల్లలకోడేరులోని సిద్ధి వినాయక ఆలయ కమిటీ సభ్యులు మురళీ కృష్ణంరాజు అన్నారు. గొల్లలకోడేరులోని ఎఎస్ఆర్ నగర్‌లో వరసిద్ధి వినా యక ఆలయం వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని శనివారం ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లా డుతూ దాత కామన రాంబాబు పుట్టినరోజును పురస్కరిం చుకుని 45 రోజులపా టు మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారని అన్నారు. ఈ సందర్భంగా ఆయనకు కమిటీ సభ్యు లు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లా డుతూ తోటి వారికి సహాయపడుతూ ముందుకు సాగాలనే ఆలోచనతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామ న్నారు. ఈ కార్యక్రమంలో రాంబాబు దంపతులు, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

వరి పంటను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ దాసిరాజు

వరి కోతలు పూర్తి చేయాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - కాళ్ల

రబీ సీజన్‌లో రైతు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి అండగా నిలుస్తుందని భీమవరం ఆర్‌డిఒ దాసి రాజు చెప్పారు. మండల పరిధిలోని పెదఅమిరం, ఏలూరుపాడు గ్రామాల్లో ఆయన శనివారం పర్యటించారు. ఇటీవల అకాల వర్షాల వల్ల వరి కోతలు రైతులు వాయిదా వేశారు. ఏలూరుపాడులో 280 ఎకరాలు, పెదఅమిరంలో 450 ఎకరాలు వరి కోతలు చేయాల్సి ఉంది. రైతులతో ఆర్‌డిఒ దాసిరాజు మాట్లాడారు. త్వరగా వరి కోతలు పూర్తి చేయాలని రైతులకు సూచించారు. ఆయనతో పాటు ఎఒ జయావాసుకి, రైతులు పాల్గొన్నారు.

మినీ మిల్లర్‌పై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

జిల్లాలో అన్ని మండల కేంద్రాల్లో తహశీల్దార్ కార్యాలయాల వద్ద ఏర్పాటుచేసిన మినీ మిల్లర్ గురించి ఎందుకు ప్రచారం చేయరని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కూసంపూడి సుబ్బరాజు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ యంత్రం గురించి రైతులకు తెలిసేలా ప్రచారం చేయాలని పేర్కొన్నారు. పొలమూరులో ఒక కౌలు రైతు మిల్లర్‌ని ఉపయోగించుకుంటానంటే స్థానిక టెక్నీషియన్ అవసరం లేదని చెప్పారన్నారు. క్షేత్రస్థాయి సంబంధిత యంత్రాంగం ఎంత నిర్లక్ష్యంతో ఉందో అర్థమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

15న యువగళం సంఘీభావ పాదయాత్ర

ప్రజాశక్తి - భీమవరం

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర వందో రోజుకు చేరుకుంటున్న సందర్భంగా సంఘీభావంగా ఈ నెల 15న జిల్లా కేంద్రం భీమవరంలో టిడిపి నాయకులతో ఎనిమిది కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి తెలిపారు. టిడిపి రాష్ట్ర ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో ఈ సంఘీభావ పాదయాత్రను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నారన్నారు. భీమవరం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాదయాత్రలో పాల్గొనాలన్నారు. 15వ తేదీ సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు వీరమ్మచెరువు బివి.రాజు పార్కు వద్ద నందమూరి తారకరామారావు విగ్రహం వద్ద నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుందన్నారు. ఆదివారం బజార్‌సెంటర్, పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నుంచి తహశీల్దార్ కార్యాలయం మీదుగా ప్రకాశంచౌక్, అంబేద్కర్ సెంటర్ మీదుగా జువ్వలపాలెం రోడ్డు అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు ఎనిమిది కిలో మీటర్ల పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రైతు పోరుబాట విజయవంతం

ఎంఎల్ఎ ఆరిమిల్లి

ప్రజాశక్తి - తణుకు

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన రైతు పోరుబాట పాదయాత్ర విజయవంతం చేసిన అందరికీ మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అభినందనలు తెలిపారు. శనివారం ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పాదయాత్రలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొని వారి సమస్యలను వివరించారన్నారు. రైతుల నుంచి ధాన్యం సేకరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. సంచులు లేక ఇచ్చిన సంచులు చిరిగిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. చంద్రబాబును తిట్టే స్థాయి స్థానిక మంత్రికి లేదన్నారు. చంద్రబాబు దిష్టిబొమ్మను దగ్ధం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. తాను రైతు కుటుంబం నుంచి వచ్చానని, రైతులపై పూర్తి అవగాహన ఉందని, తన తాత 40 ఏళ్ల క్రితమే రైస్ మిల్లు స్థాపించారని తెలిపారు. మూడేళ్ల కాలంలో రైతులకు ఏనాడైనా సక్రమంగా డబ్బులు చెల్లించారా అని ప్రశ్నించారు.

నరసాపురం టౌన్ :తణుకు నియోజకవర్గంలో చంద్రబాబు చేపట్టిన రైతు పోరుబాట సభ విజయవంతమైందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ఎంఎ షరీఫ్ అన్నారు. నరసాపురం టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఎక్కడ సభ పెట్టినా ప్రజలు స్వచ్ఛందంగా వస్తున్నారన్నారు. 2024లో వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమే అన్నారు. టిడిపి నరసాపురం ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు మాట్లాడుతూ రైతు పోరుబాట సభ విజయంతమైందని, ఈ సభకు నరసాపురం నియోజవర్గం నుంచి వచ్చిన నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో వైసిపి ఆరాచక పాలన చేస్తుందన్నారు. రైతుల దగ్గర రెండు కేజీల ధాన్యం ఎక్కువ తీసుకుంటున్నారని, గతంలో ఇలాంటి పరిస్థితి లేదని చెప్పారు. అకాల వర్షాలతో రైతు నష్టపోతే ఈ దందా ఏంటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కొప్పాడ రవీంద్రనాథ్‌ఠాగూర్, గుబ్బల నాగరాజు, జక్కం శ్రీమన్నారాయణ, వాతాడ ఉమామహేశ్వరరావు, ప్రసాద్, జోగు పండు, కొల్లు పెద్దిరాజు పాల్గొన్నారు.